క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లిరూరల్: చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో శనివారం విద్యుత్ నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ వనుము ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్లు మరమ్మతుల కోసం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలుపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటన

వై.రామవరం: మండలంలోని పలు గ్రామాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి పర్యటిస్తారని ఎంపీపీ కడబాల ఆనందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని జంగాలతోట, బురదకోట, నెల్లికోట, దద్దిలికివాడ, రాములకొండ, శింగవరం, బండిగడ్డ, దబ్బమామిడి, కణతలబంద, మునగలపూడి, అమ్మపేట, బూరుగుపాలెం, అన్నంపాలెం, పులుసుమామిడి, దాలిపాడు, తునికలపాడు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తారని పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

అమ్మవారి జాతర ఉత్సవాలు ప్రారంభం



గడిబాపనమ్మ అమ్మవారు

రంపచోడవరం: మండలంలోని సీతపల్లి గ్రామంలో కొలువైన మాతృ శ్రీ గడిబాపనమ్మ అమ్మవారి జాతర మహోత్సవములు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 8వ తేదీ వరకు ఐదు రోజుల పాటు అమ్మవారి జాతర మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ గండేపూడి సత్యరమేష్ చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి మహాకుంభం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సారె సమర్పణ, ఊయల సేవ, మహాచండి హోమంతో కార్యక్రమం ప్రారంభమైంది.

నేటి నుంచి తాకాశివీధి నూకాంబిక జాతర

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవం శుక్రవారం నుంచి మే 7 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ తాకాశి రాజేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న రాత్రి 7గంటల నుంచి శ్రీసత్యసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద భజన కార్యక్రమంతో జాతర ఉత్సవం ప్రారంభం అవుతుందన్నారు. 6న సాయంత్రం 6 గంటలకు గరగల ఊరేగింపు, సీతానగరం వారిచే కోలాటం, వెంకటాపురం వారిచే తోడపెద్దు సేవ, 7న సాయంత్రం 6 నుంచి రాత్రంతా అమ్మవారి జాతర అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. 8న కొత్త అమావాస్య సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 9న క్రోధి నామ సంవత్సర ఉగాది నాడు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పండ్ల రసంతో అభిషేకాలు, రాత్రికి దీపాలంకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అరకులోయరూరల్: అరకు పార్లమెంట్ అభ్యర్థి తనుజరాణి భర్త , వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం మండల కేంద్రం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు, స్వీట్లను నేత మొశ్య రంజిత్‌కుమార్ పంపిణీ చేశారు. నాయకులు గిరి, మోజేష్, తిరుపతి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్.. పరేషాన్




మండుటెండలో పింఛన్ల కోసం గ్రామ సచివాలయాలకు వస్తున్న వృద్ధులు

- మండుటెండలో కాలినడకన సచివాలయాలకు చేరిన పింఛన్‌దారులు
- గంటలకొద్దీ నిరీక్షణ
- అరకొరగానే పెన్షన్ పంపిణీ
- తలెత్తిన సాంకేతిక సమస్యలు



చింతపల్లి గ్రామ సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు



పంగళం గ్రామంలో పింఛన్ కోసం నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు



గంగవరంలో పింఛన్ సొమ్ము ఇస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది



వనుగుమ్మ సచివాలయం వద్ద పింఛన్ కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

అరకులోయ రూరల్/అనంతగిరి/పెదబయలు/హుకుంపేట/చింతపల్లి రూరల్/జి.మాడుగుల/కొయ్యూరు/రంపచోడవరం/వై.రామవరం/అడ్డతీగల/గంగవరం/రాజవొమ్మంగి/చింతూరు: కూర్చున్న చోటికే ఒకటో తారీఖున ఠంచనుగా వచ్చే పింఛను చంద్రబాబు కుట్రతో రాకపోవడంతో అవ్వా, తాతలకు ఇబ్బందులు తప్పడంలేదు. గురువారం పింఛను పంపిణీ ప్రారంభమైనా సచివాలయ సిబ్బందికి కొత్త కావడంతో తిప్పలు తప్పడంలేదు. కొన్ని ప్రాంతాల్లో బయోమెట్రిక్ పడకపోవడం, మరికొన్ని చోట్ల ఐరిష్ వంటి సాంకేతిక సమస్యలతో పంపిణీలో జాప్యం జరిగింది.వలంటీర్లు మా ఇళ్లకు ఇలా వచ్చి అలా పింఛను ఇచ్చి వెళ్లిపోయే వారని, ఇప్పుడేమో మండుటెండలో కిలోమీటర్లు నడిచి గ్రామ సచివాలయాలకు వెళ్లి.. గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితులు దాపురించాయంటూ పింఛనుదారులు తమ వలంటీర్ల సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

తీరని వెతలు

వయస్సుపైబడిన పండుటాకులకు పింఛను తీసుకొనేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. గత మూడు రోజులుగా ఇదిగో ఇస్తున్నారు, అదిగో ఇస్తున్నారు అనగానే వృద్ధులు, వింతువులు, వికలాంగులు సచివాలయాల చుట్టు తిరుగుతూనే ఉన్నారు. మండుటెండను లెక్కచేయకుండా పండుటాకులు తలపై తువ్వాలు కప్పుకొని, చేతి కర్ర సహాయంతో పింఛను కోసం సచివాలయ బాట పట్టారు. ఆకలితో కడుపు మాడుతున్నా తమకు అందాల్సిన సొమ్ముల కోసం సచివాలయ ప్రాంగణాల్లోనే లబ్ధిదారులు పడిగాపులు కాస్తూ దర్శనమిచ్చారు. చంద్రబాబు కుట్ర రాజకీయంతో వలంటీర్లు తప్పించడం వలన సకాలంలో పెన్షన్లు పొందలేక, కిలోమీటర్లు కొలది కాలినడకన మండుటెండలో ఎన్నో బాధలు, పడి ప్రయాణించాల్సి వస్తుందని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి తారీఖునే ఇంటి వద్దకే వలంటీర్లు పింఛను తెచ్చి ఇచ్చేవారని, ఇప్పుడు అదే పింఛను తీసుకోడానికి నాలుగు రోజులు గడుస్తున్నా నానా ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోయారు. సీఎం జగన్ దయ వల్ల ఏర్పాటైన వలంటీర్ల ద్వారా ఇన్నాళ్లు పంపిణీ చేస్తున్నారని,ఎ లాంటి ఇబ్బంది లేకుండా ఇంటికి తెచ్చి ఇచ్చేవారని గుర్తు చేశారు. ఇప్పుడు చంద్రబాబు కుట్రల వల్లే మాకు ఇబ్బందులు వచ్చాయని మా ఉసురు తగిలి చంద్రబాబు, పొత్తు పార్టీల నాయకులు నాశనం అవుతారని పండుటాకులు శాపనార్థాలు పెట్టారు.

పింఛన్ పంపిణీలో జాప్యం

ఇదిలా ఉండగా సచివాలయాల్లో పింఛనుదారులు తమ పింఛను కోసం ఎవరి వద్దకు వెళ్లాలో తెలియకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. తీరా ఎవరో ఒకరి వద్దకు వెళితే నువ్వు నా వలంటీరు పరిధిలో లేవు, వేరొకరి వద్దకు వెళ్లాలంటూ సిబ్బంది చెబుతున్నారని పింఛన్‌దారులు వాపోయారు. బయోమెట్రిక్ పడని వారికి ఐరిష్ ద్వారా ప్రయత్నించి, సమస్య తలెత్తితే మరుసటి రోజు రావాలంటూ తిప్పి పంపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కొన్ని మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యల కారణంగా పింఛను పంపిణీ మరింత జాప్యం జరిగింది.

దాతల ఔదార్యం

హుకుంపేట మండలంలోని కొట్నాపల్లిలో పింఛన్ కోసం కాలినడకన వెళ్తున్న వృద్ధులకు ఓ దాత మంచినీటి బాటిళ్లు పంపిణీ చేసి ఔదార్యాం చాటుకున్నారు. పింఛన్‌దారులైన వృద్ధులను సుదూరంలో ఉన్న గ్రామ సచివాలయానికి వెళ్లేందుకు దాత సూరిబాబు తన సొంత నిధులతో ఆటో సమకూర్చి సాయం చేశారు. రాజవొమ్మంగి సచివాలయం వద్ద ఉదయం నుంచి పింఛన్ కోసం అవ్వాతాతలు, దివ్యాంగులు, రోగులు తరలివచ్చారు. మధ్యాహ్నం అయినా వారికి పింఛన్ అందకపోవడంతో ఆకలితో ఇబ్బందులు పడుతున్న వారికి ఓ దాత భోజన ఏర్పాట్లు సమకూర్చాడు.

ఇబ్బందులు పడ్డాను



సకాలంలో పింఛన్ సొమ్ము అందక ఇబ్బందులు పడ్డాం. వలంటీర్ ద్వారా నెలలో మొదటి రోజునే పెన్షన్ అందేది. జి.ఎం.కొత్తూరు నుంచి జి.మాడుగుల సచివాలయానికి వచ్చాను. నా బంధువు సాయంతో వాహనంపై ఇక్కడికి వచ్చాను. గంటల తరబడి వేచిన తరువాత పింఛన్ అందింది.

–కొర్రా బేష్, జిఎం కొత్తూరు, జి.మాడుగుల

ఎండలో నడుచుకుంటూ సచివాలయానికి



నేను ఉండేది చింతపల్లి మండలం పెద్దపైపు వీధి, నాకు జగన్ ప్రభుత్వంలో వలంటీర్లతో ఇంటికే ఫించన్ తెచ్చి ఇచ్చేవారు. కాని రెండు, మూడు రోజులు తిరిగితే గాని పింఛన్ తీసుకోడానికి అవకాశంలేదు. మండుటెండలో పింఛన్ తీసుకోనేందుకు వెళ్లాల్సి వచ్చింది

– నూకాలమ్మ, పెద్దపైపు వీధి, చింతపల్లి గ్రామం

ఆరు కిలోమీటర్లు కాలినడకన



ప్రతీ నెల మొదటి రోజునే వలంటీర్ ఇంటివద్దకు పెన్షన్ సొమ్ము తెచ్చి ఇచ్చేవాడు. చంద్రబాబు కుట్రల వల్ల వలంటీర్ సేవలు దూరమవడంతో పింఛన్ కోసం ఆరు కిలోమీటర్లు దూరం నుంచి మండుటెండలో కాలినడనక ఇబ్బందులు పడుతూ వచ్చాను.

– వంతాల సింగన్న, రోలంగిపట్టు గ్రామం, జి.మాడుగుల మండలం

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు



వలంటీర్ ద్వారా పెన్షన్ సకాలంలో నెల మొదటి రోజున ఇంటికి తెచ్చి ఇచ్చేవాడు. అ పద్దతి బాగుంది. ఇప్పుడు సచివాలయానికి వెళ్లడం అంటే చాలా కష్టమవుతుంది. మండుటెంలో కాలినడకన గ్రామ సచివాలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డాం. మా లాంటి వృద్ధులకు ఇంటివద్దనే వలంటీర్ ద్వారా పింఛన్ ఇస్తే బాగుంటుంది. చంద్రబాబు చేసిన కుట్ర రాజకీయాలకు బలవుతున్న పింఛన్‌దారులు త్వరలో గుణపాఠం చెబుతారు.

– పాంగి సుక్రీ, వృద్ధురాలు, గున్నమామిడి గ్రామం

కుట్ర రాజకీయాలకు బలి



నాకు చూపు మందగించడంతో సరిగా కనబడుదు. నడవడానికి కాలు కూడా రావటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో సచివాలయానికి ఎలా రావాలి. మాకు ఏ విధమైన కష్టం ఉండకూడదని నా కొడుకు లాంటి జగన్ ఇన్నాళ్లు గడపు వద్ద వలంటీర్ ద్వారా పింఛన్ అందించారు. ఇప్పుడు చంద్రబాబు మాకు తీరని అవస్థలు పెడుతున్నాడు. సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవడం చాలా కష్టంగా ఉంది. చంద్రబాబు చేస్తున్న కుట్ర రాజకీయాలకు మేము బలవుతున్నాం. త్వరలో చంద్రబాబుకు బుద్ధి చెబుతాం.

– గుల్లెలి లక్ష్మి, వృద్ధురాలు,దిగుడుపుట్టు గ్రామం



అనంతగిరి గ్రామ సచివాలయం వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు



కిమ్మూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది



జి.మాడుగుల సచివాలయంలో పెన్షన్ కోసం వేసి ఉన్న పింఛన్‌దారులు

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



బుంగాపుట్టులో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



చికిలింతలో అవగాహన కల్పిస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది



లంబసింగిలో ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

ముంచంగిపుట్టు/రాజవొమ్మంగి/చింతపల్లి రూరల్: ముంచంగిపుట్టు బుంగాపుట్టు పంచాయతీలో సీఐ రమేష్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. బుంగాపుట్టు పంచాయతీలో ప్రతికూల పరిస్థితులలో భాగంగా పోలింగ్ కేంద్రం లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ రోజును పోలింగ్ కేంద్రానికి తరలించేందుకు నాలుగు జీపులను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. బుంగాపుట్టు గ్రామస్తులు ఎన్నికలు బహిష్కరించొద్దని కోరారు. తహసీల్దార్ రఫీజాన్, ఎస్‌ఐ రవీంద్ర, ఆర్‌ఐ రవికుమార్, సర్పంచ్ నోయిన తదితరులు పాల్గొన్నారు. రాజవొమ్మంగి మండలంలోని చికిలింత, కరుదేవపాలెం, వంచంగి, బలిజపాడు, మారేడుబాక, ఉర్లాకులపాడు గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దార్ ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓటు ప్రాధాన్యతను గ్రామస్తులకు వివరించారు. చింతపల్లి మండలంలోని తాజంగి, లంబసింగి గ్రామాల్లో గిరిజనులకు ఓటు హక్కుపై తహసీల్దార్ టి.రామకృష్ణ అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని, దీన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరుగా నమోదుకు అర్హులు ఈ నెల 14 తేదీ వరకు నమోదు చేసుకోవచ్చాన్నారు.ఆర్‌ఐ కృష్ణమూర్తి, చిన్నయ్య పడాల్ తదితరులు పాల్గొన్నారు.

పాంగి రాములమ్మ మృతికి సంతాపం



పోయిపల్లిలో రాములమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: మండలంలోని పెదకోడాపల్లి సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యుడు పాంగి అప్పారావు పెద్దమ్మ పాంగి రాములమ్మ(62) అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పోయిపల్లి గ్రామంలో జరిగిన అంత్యక్రియలు, అంతిమ యాత్రలో పాల్గొన్నారు. రాములమ్మ గ్రామానికి వెళ్తే ఎంతో ఆప్యాయంగా పలకరించేదని, ముఖ్యంగా సీఎం జగన్ అంటే ఎనలేని అభిమానమని, ప్రభుత్వ పథకాలను ఆదివాసీలకు కువి బాషలో బోధించేదని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు పాంగి అప్పారావు, సర్పంచ్ బట్టి చిట్టిబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన



మేలుకొలుపు పుస్తకాలను పంపిణీ చేస్తున్న చిట్టిబాబు

జి.మాడుగుల: మండలంలోని కెజీబీవీ, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలురు పాఠశాలల వినియోగదారుల క్లబ్ సభ్యులకు, పాఠశాల ప్రత్యేక అధికారి, సిబ్బంది, క్లబ్ ఇన్‌చార్జీల సమక్షంలో గురువారం జిల్లా వినియోగదారుల సంఘం సమాఖ్య అధ్వర్యంలో విద్యార్థులకు మేలుకొలుపు పుస్తకాలను పంపిణీ చేశారు. వినియోగదారుల చట్టాలపై జిల్లా వినియోగదారుల సంఘం సమాఖ్య అధ్యక్షుడు బూడిది చిట్టిబాబు అవగాహన కల్పించారు. తూనికలు, నాణ్యత, నిల్వ ప్రమాణాలు, కొలతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వినియోగదారుడు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు సంబంధించిన రసీదు పొందాలని సూచించారు. నాసి రకం, కాలం చెల్లిన వస్తువుల విక్రయాలపై వినియోగదారుల సంఘానికి ఫిర్యాదు చేయాలన్నారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారుల చట్టాలు, హక్కులపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రమేష్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి

- రెండు నెలలు ఓపిక పట్టండి జగనన్న మళ్లీ ఇంటి వద్దకే పెన్షన్ అందిస్తారు
- అవ్వా తాతలకు భరోసా కల్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు



దేవరాపల్లిలో పర్యటిస్తున్న పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: రాష్ట్రంలో పేద, నిరుపేద ప్రజల వ్యతిరేకి చంద్రబాబు అని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. మండలంలో వంజరి పంచాయతీ దేవరాపల్లి, మూలగరువు, బలిజపేట, కిముడుపల్లి, వెర్లమామిడి, కర్రపాడు, తాడేపాలెం గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అవ్వ తాతలకు ప్రతీ నెల ఒకటో తేదీన తెల్లవారుజామున ఇంటి తలుపు తట్టే మొదటివ్యక్తిగా గుర్తుకొచ్చేది వలంటీరని, ప్రజా సేవల నుంచి దూరం చేసి కక్షపతి చంద్రబాబు అని అన్నారు. చంద్రబాబు కుట్ర రాజకీయాలతో వలంటీర్లను విధుల నుంచి తొలగించడంతో అవ్వతాతలు పడుతున్న ఇక్కట్లను విశ్వేశ్వరరాజు చూసి పింఛన్‌దారులను ఓదార్చారు. రెండు నెలలు ఓపిక పడితే మీ మద్దతుతో జగనన్న మళ్లీ అధికారంలో వచ్చి మీ ఇంటి వద్దకే పింఛన్ అందించే ఏర్పాట్లు చేస్తారని భరోసా ఇచ్చారు. పేదల ఉసురు తగిలి రానున్న ఎన్నికల్లో టీడీపీ, పొత్తుల పార్టీలను ఓడించడాలని గ్రామస్తులు కోరారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవటానికి మరింత సుపరిపాలన కొనసాగించుకోవటానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు, జెసీఎస్ మండల కన్వీనర్ కళ్యాణం, ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, ఎంపీటీసీలు మధు, గబ్బాడి సన్యాసిదొర, కూడా చిన్నారావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సంబర్ పాంగి అంద్రయ్య, నాయకులు సీతారాంనాయుడు, సోమలింగం, దేముళ్లునాయుడు, అచ్చిబాబు, కె.మత్స్యరాజు, కొండబాబు, సాయి, పండన్న, వెంకటరమణ, కె.అప్పారావు, వెంకటరావు, అశోక్, మత్స్యకొండ బాబు, శ్రీనివాస్, ప్రశాంత్ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి



రంగిలసింగిలో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కొల్లాపుట్టులో గ్రామస్తులతో నాయకులు



పాలగూడెంలో మాట్లాడుతున్న నాయకులు



పెద్దమట్టపల్లిలో మాట్లాడుతున్న సర్పంచ్ పిట్టా రామారావు

అరకులోయ/ముంచంగిపుట్టు/డుంబ్రిగుడ/చింతూరు/వీఆర్ పురం : జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ఇందులో భాగంగా అరకులోయ, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, చింతూరు, వీఆర్ పురం మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు గ్రామాల్లో పర్యటించి, గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. అరకులోయ, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టులలో మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణరావు, మల్లేశ్వరరావు, పాంగి పద్మారావు, చింతూరులో జెడ్పీటీసీ చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వీఆర్‌పురంలో చినమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా సీఎం జగనన్న అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి దేశానికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిలను భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను కోరారు. ఎంపీపీ సీతమ్మ, సర్పంచ్‌లు బాబూరావు, రమేష్, జేసీఎస్ కన్వీనర్ కొండలరావు, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు హరి,వైస్ ఎంపీపీ రామన్న, సుమిత్ర, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్‌లు రామ్మూర్తి, సుబ్బారావు, ముచ్చిక నాగార్జున, కాక అరుణకుమారి, కారం కన్నారావు, జేసీఎస్ మండల కన్వీనర్ కోట్ల కృష్ణ, నేతలు అప్పారావు, రాంప్రసాద్, కృష్ణారావు, భీమన్న, విజయ్‌కుమార్, బాలరాజు, విప్లవ్ కుమార్, సీతారామయ్య, జయరాజ్, ముత్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కవి సమ్మేళనానికి రమేష్

వీఆర్ పురం: మండలానికి చెందిన మన్యం కవి నూనె రమేష్‌కు ఈ నెల 7న అమలాపురంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఉగాది కవి సమ్మేళనానికి ఆహ్వానం లభించినట్టు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి నేతృత్వంలో అంతర్జాతీయ సాహితీ సేవా సంస్థ కళావేదిక కొనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొనుటకు ఆహ్వానం అందుకున్నందుకు సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

నిప్పులు చెరిగిన సూరీడు

రాజవొమ్మంగి: మండలంలో గురువారం సూరీడు నిప్పులు కురిపించాడు. ఉదయం 10 గంటల నుంచే ఎండ వేడిమికి స్థానికులు అల్లాడారు. ఇక్కడ పరిసరాల్లో సుమారు 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఎండధాటికి మధ్యాహ్న వేళలో దుకాణాలను మూసి వేశారు. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉక్కపోత, వేడిమికి వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బంది పడ్డారు. పండ్ల రసాలు, కూల్ డ్రింక్స్‌కు గిరాకీ నెలకొంది. వాహనచోదకులు ఎండవేడిమికి అల్లాడిపోయారు. మూగజీవులు చెట్ల నీడన సేదతీరాయి. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే రానున్న మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. చల్లగా ఉండే మన్యంలో రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి.

మతిస్థిమితం లేని వ్యక్తిని దొంగగా అనుమానించి..

కొయ్యూరు: మతిస్థిమితం లేని వ్యక్తిని దొంగగా భావించి చీడిపాలెం పంచాయతీ సింగవరం గ్రామస్తులు బంధించారు. చొక్కా లేకుండా బుధవారం రాత్రి నుంచి అనుమానస్పదంగా సంచరిస్తుండడంతో దొంగగా భావించి స్థానికులు అతన్ని పట్టుకున్నారు. గురువారం ఉదయం స్థానిక పోలీసులకు అప్పగించారు. పట్టుకున్న యువకుడి రోలుగుంట మండలం కంచుకొమ్మలకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. గొలుగొండ మండలం కొండసింగిలో ఉంటున్న యువకుడు అమ్మమ్మ కె.రాజులమ్మకు ఎస్‌ఐ రామకృష్ణ అప్పగించారు. మనువడికి మతిస్థిమితం లేక ఇలా తిరుగుతున్నట్టు ఆమె చెప్పారు.